క్లుప్తంగా

కౌమార దశపై అవగాహన కల్పించాలి



విద్యార్థిని పరీక్షిస్తున్న డాక్టర్ మోహన్‌కృష్ణ

పాలసముద్రం: బాల బాలికలకు కౌమార దశలో వచ్చే మార్పులపై అవగాహన కల్పించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. సోమవారం పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆరోగ్య సిబ్బందికి సూపర్ వైజర్ మురళి, సుశీల అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మోహన్‌కృష్ణ మాట్లాడుతూ ప్రతి శుక్ర, శనివారాల్లో బాల, బాలికలకు రక్తహీనత నివారణకు ఐరన్, పోలిక్ మాత్రలు పంపిణీ చేయాలని చెప్పారు. అనంతరం పాలసముద్రం ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు శరీరంపై ఏమైనా మచ్చలున్నాయా? ఉంటే స్పర్శలో తేడాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు గంగ, గౌరి పాల్గొన్నారు.

శ్మశాన స్థలం కేటాయింపు



బోర్డు ఏర్పాటు చేస్తున్న అధికారులు

వెదురుకుప్పం: మండలంలోని కొమరగుంట పంచాయతీ సద్దికూళ్లపల్లె ఆదిఆంధ్రవాడ గ్రామంలో శ్మశానానికి స్థలాన్ని కేటాయించినట్లు వీఆర్వో బాబు తెలిపారు. సోమవారం గ్రామానికి సమీపంలోని తిరుపతి ప్రధాన రహదారి పక్కన సర్వే నంబర్ 70లో 50 సెంట్ల భూమిని గుర్తించి కేటాయించారు. ఆ స్థలంలో శ్మశానం బోర్డు పెట్టారు. ఈ కార్యక్రమంలో డీడీఓ కుమార్, ఎంపీటీసీ సభ్యుడు మునిచంద్రారెడ్డి, సోమశేఖర్ పాల్గొన్నారు.

పండ్లు, రొట్టెల పంపిణీ

కార్వేటినగరం: ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో చికిత్స పొందుతున్న రోగులకు సోమవారం కార్వేటినగరంలోని యెహోవా ఈరే చర్చి పాస్టర్ సరోజినీ అగస్టిన్ పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ మాట్లాడుతూ యెహోవా ఈరే చర్చి స్థాపించి 23 సంవత్సరాలు పూర్తి అయ్యిందని, స్థాపకులైన పాస్టర్ రవికుమార్ జయంతిని పురస్కరించుకుని చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేసి, ఆయన జ్ఞాపకార్థం వృద్ధులు, రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఎస్తేర్ రాణి పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి



హాజరు పట్టికను పరిశీలిస్తున్న ఎంపీపీ లత

కార్వేటినగరం: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపీపీ లత అన్నారు. సోమవారం స్థానిక సచివాలయం–3ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సచివాలయాల్లో విధులు నిర్వహించే సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలన్నారు. సిబ్బంది ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందించిన యూనిఫామ్ తప్పనిసరిగా ధరించాలని చెప్పారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. సిబ్బందిపై ఫిర్యాదులు రాకుండా చూసుకోవాల్సిన అవసరం కార్యదర్శికి ఎంతైనా ఉందని ఆమె చెప్పారు. వలంటీర్లు సక్రమంగా విధులు నిర్వహిస్తున్నారా? లేదా అన్న విషయం అడిగి తెలుసుకున్నారు.

తీరనున్న డ్రైనేజీ సమస్య

వడమాలపేట: ఎన్నో ఏళ్లుగా డ్రైనేజీలు లేక ఇబ్బంది పడుతున్న టీసీ అగ్రహారం ప్రజలకు ఎట్టకేలకు మంత్రి రోజా చొరవతో సమస్య పరిష్కారమైంది. మండలంలోని టీసీ అగ్రహారంలో ఇటీవల మంత్రి ఆర్కే రోజా గడపకుగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించిన సందర్భంగా గ్రామస్తులు సీసీ రోడ్లు, డ్రైనేజీ సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన మంత్రి ప్రభుత్వం నుంచి రూ.20 లక్షలు మంజూరు చేయించి, వెంటనే గ్రామంలో డ్రైనేజీ, సిమెంటు రోడ్లు నిర్మాణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. దీంతో ఎన్నో సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారమవుతుందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మత్తుకు బానిస కావొద్దు

పాలసముద్రం: మండలంలోని ప్రజలు మత్తు పదార్థాలకు బానిస కాకూడదని ఎస్‌ఐ సురేష్ తెలిపారు. సోమవారం బలిజకండ్రిగలో మద్యం, గంజాయి తదితర మత్తు పదార్థాలు తీసుకోవడంతో కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌ఐ సురేష్ మాట్లాడుతూ మద్యం తాగడంతో పలువురు ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. గంజాయి, మద్యం తదితర మత్తు పదార్థాలకు బానిసలైతే కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురై, చిన్నాభిన్నం కావడంతో పాటు వాటిని సేవించిన వ్యక్తి అనారోగ్యం పాలవుతాడని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ రమణరావ్, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మీ భూమి.. మా హామీ

- శాశ్వత భూహక్కు, భూ రక్షకు 'రీ సర్వే'
- వందేళ్ల తర్వాత పట్టణ ప్రాంతాల్లో ఆస్తుల మదింపు



నివాసాలను సర్వే చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

భూముల వివరాలు.. సవరణలు.. తప్పుల సరిద్దడం.. ఆస్తుల క్రమబద్ధీకరణకు పట్టణ ప్రాంతాల్లోని మున్సిపల్ కార్యాలయాల చుట్టు కాళ్లరిగేలా తిరగాల్సిన అవసరం ఇక ఉండదు. మీ భూమి– మా హామీ కార్యక్రమంలో భాగంగా రెవెన్యూ, పురపాలక శాఖాధికారులే మీ ఇంటికే వచ్చి, రీ సర్వే చేసి, ఆస్తులకు శాశ్వత పత్రాలు మంజూరుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీనిపై ప్రత్యేక కథనం.

నగరి: పట్టణ ప్రాంతాల్లో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం ముందడుగు వేస్తోంది. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం ద్వారా మున్సిపల్ పరిధిలో వందేళ్ల తరువాత పట్టణ ప్రాంతాల్లో మీ భూమి– మాహామీ అన్న పేరుతో రీ సర్వే ప్రక్రియను పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మున్సిపల్ పరిధిలోని నివాసాలను రీ సర్వే చేసి, కచ్చితమైన వివరాలు అందించనుంది. అత్యంత వ్యయంతో కూడిన ఈ మహాయజ్ఞం దేశంలోనే మొట్టమొదటిసారిగా మన రాష్ట్రంలోనే జరుగుతోంది. రెవెన్యూ, సర్వే భూ రికార్డుల శాఖ, పురపాలక పట్టణాభివృద్ధి శాఖల సంయుక్త భాగస్వామ్యంతో సమగ్ర రీసర్వే నిర్వహిస్తున్నారు. ఈ సర్వేను ఏడు ప్రక్రియలుగా నిర్వహించి ప్రతి ఆస్తికి ప్రభుత్వ హామీతో కూడిన శాశ్వత హక్కు పత్రం ఇవ్వనున్నారు. మున్సిపల్ పరిధిలోని 29 వార్డుల్లోని 14,174 నివాసాలకు ఈ సర్వే నిర్వహించనున్నారు.

సర్వే ఇలా...

- వార్డు సభల ద్వారా సర్వే విధి విధానం, షెడ్యూలు ప్రయోజనాల వివరణ.
- వార్డు సచివాలయ పరిధిలో సమగ్ర సర్వే నిర్వహణకు సర్వే బృందాల ఏర్పాటు
- డ్రోన్, కార్స్ నెట్‌వర్క్, రోవర్ వంటి ఆధునిక పరికరాల ద్వారా ప్రతి స్థిరాస్తిని అత్యంత కచ్చితంగా భూ అక్షాంశ, రేఖాంశాలతో గుర్తించి కొత్త సర్వే, రెవెన్యూ రికార్డులను తయారు చేయడం.



పట్టణ సర్వే పటం నమూనా

- ప్రతి యజమానికి పై రికార్డులను సెక్షన్ 9(2) నోటీసు ద్వారా తెలియజేయడం
- ఏవైనా అభ్యంతరాలుంటే వార్డు సర్వే బృందాల ద్వారా అప్పీలుకు అవకాశం కల్పించడం.
- మున్సిపల్‌స్థాయిలో నియమించిన మొబైల్ మెజిస్ట్రేట్ బృందాల ద్వారా అప్పీళ్లను పరిష్కరించడం.
- సర్వే పూర్తి చేసిన అనంతరం ప్రతి ఆస్తికి శాశ్వత భూ హక్కు పత్రం అందించడం.
- భవిష్యత్‌లో ఆస్తులకు సంబంధిత తగాదాలు ఏర్పడినా పరిష్కారానికి వీలుగా సర్వే, రెవెన్యూ రికార్డులు, ఆస్తుల వివరాలు డిజిటల్ రూపంలో వార్డు సచివాలయంలో అందుబాటులో ఉంచడం.

ఆస్తులకు కొత్తగా డిజిటల్ రూపంలో సిద్ధమయ్యే రికార్డులు

- భూ కమత పటం
- పట్టణ సర్వే పటం
- రీ సర్వే ల్యాండ్ రిజిస్టర్
- 1బి రిజిస్టర్,
- శాశ్వత భూ హక్కు పత్రం

సర్వేతో నివాసితులకు కలిగే లాభాలు

ఆస్తులకు కచ్చితమైన కొలతలు చూపించడంతో పాటు ప్రభుత్వ హామీతో కూడిన శాశ్వత భూమి హక్కు పత్రం అందించడం జరుగుతుంది. ల్యాండ్ మ్యాప్‌లు అందజేస్తారు. ఆస్తికి గుర్తింపు నంబర్ అందజేస్తారు. అభ్యంతరాలుంటే పరిష్కరించడానికి మున్సిపల్ స్థాయిలో మొబైల్ మెజిస్ట్రేట్ టీమ్ అందుబాటులో ఉంటుంది. దళారీ వ్యవస్థకు చెక్‌పెట్టడం జరుగుతుంది. భూ యజమానులు కార్యాలయాల చుట్టూ, అధికారుల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదు. ఈ శాశ్వత భూ హక్కును వేరొకరు సవాలు చేయడానికి వీలుండదు. క్రమబద్ధీకరణ చేయని నివాసాలకు క్రమబద్ధీకరణ చేయడం జరుగుతుంది.

ప్రజలు సహకరించాలి

సర్వే చేసే సమయంలో యజమానులు వారికి సంబంధించిన భూ హక్కు పత్రాలతో హాజరై సర్వే సిబ్బందికి సహకారం అందించాలి. ఈ సర్వేపై ఎటువంటి అనుమానాలు, అపోహలు వద్దు. సర్వేతో లాభం తప్ప నష్టం ఏ మాత్రం ఉండదు. వ్యవసాయ భూములకు కచ్చితమైన రికార్డులు అందించినట్లే పట్టణ పరిధిలోని ఆస్తులకు కచ్చితమైన రికార్డులు అందించడానికే ఈ రీ సర్వే. ఇళ్ల వద్దకు విచ్చేసే సర్వే సిబ్బందికి ప్రజలు సహకారం అందిస్తే సర్వే త్వరగా పూర్తవుతుంది.



–వెంకట్రామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, నగరి మున్సిపాలిటీ

పారదర్శకంగా రీ సర్వే



మాట్లాడుతున్న ప్రసాద్

పాలసముద్రం: మండలంలో జరగనున్న జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా చేస్తున్న రీ సర్వేను పారదర్శకంగా చేయాలని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే పీవీ ప్రసాద్ తెలిపారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో గ్రామ సచివాలయాల సర్వేయర్లు, వీఆర్వోలకు తహసీల్దార్ బాబు అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే పీవీ ప్రసాద్ మాట్లాడుతూ పాలసముద్రంలో 516 ఎకరాలు, ఆముదాల 898 ఎకరాలకు సంబంధించి మంగళవారం నుంచి రీ సర్వే జరుగుతుందన్నారు. ఈ రెండు రెవెన్యూ గ్రామాల పరిధిలో నాలుగు బృందాలు రీ సర్వే చేస్తాయని తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులు రెండు పాస్‌పోర్టుసైజు ఫొటోలు, ఆధార్ కార్డు, పాసు పుస్తకం జెరాక్స్, బ్యాంకు ఖాతా నంబర్ అందజేయాలన్నారు. రైతులు మరణించి ఉంటే వెంటనే వారి వారసుల పేరున ఆస్తుల మార్పునకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. లేకుంటే రీ సర్వే పూర్తయిపోతే మార్పుటకు వీలుకాదని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మధుబాబు, మండల సర్వేయర్ విజయకుమార్, వీఆర్వోలు శ్రీనివాసులు, తంగరాజ్, శంకర్, సాధు, రమణయ్య పాల్గొన్నారు.

కొండమల్లీశ్వరునికి ప్రత్యేకపూజలు



వెదురుకుప్పం: మండలంలోని డీఆర్‌ఎస్‌కండ్రిగ సమీపంలో అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి విశేష పూజలు చేశారు. వేకువ జామునే సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం స్వామివారికి పాలాభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించి, తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. ఆలయం ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ప్రతి మహిళకు ఆర్థిక అక్షరాస్యత అవసరం



మాట్లాడుతున్న ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్

పాలసముద్రం: ప్రతి స్వయం సహాయక సంఘ సభ్యురాలికి ఆర్థిక అక్షరాస్యత అవసరమని ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్ తెలిపారు. సోమవారం మండల మహిళ సమాఖ్య పరిధిలో సంఘమిత్రలు, వీఓ లీడర్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ ప్రతి గ్రూపునకు బ్యాంకు లింకేజీ రుణాలు రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షలు వరకు వడ్డీలేని రుణం వస్తుందన్నారు. ఈ నేపథ్యంలో సుస్థిర ఆర్థికాభివృద్ధి సాధనకు ప్రణాళికలు రూపొందించుకుని, ఆ నగదును పెట్టుబడులు పెట్టా లని సూచించారు. వీఓ లీడర్లు సభ్యుల వ్యక్తిగత పాస్ పుస్తకాలు, గ్రూపు సమావేశ పుస్తకం ప్రతినెల మీటింగ్‌లోనే రాసుకుని అందరితో సంతకాలు చేయించాలని సూచించారు. సీసీ చిరంజీవి, సంఘమిత్రలు మురగయ్య, మంజుల, శోభ పాల్గొన్నారు.

సారా కేసులో ఇద్దరి అరెస్టు



నిందితుల అరెస్ట్ చూపుతున్న ఎస్‌ఈబీ అధికారులు

పుత్తూరు రూరల్: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, తిరుపతి జిల్లా టాస్క్ ఫోర్స్ సిబ్బంది సంయుక్తంగా సోమవారం నిర్వహించిన దాడుల్లో 100 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేసి, ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. ఎస్‌ఈబీ సీఐ కృష్ణ కథనం మేరకు.. నారాయణవనం మండలం, కీళగరం చెరువు కట్టవద్ద చేసిన దాడుల్లో కీళగరం గ్రామానికి చెందిన టి.సుబ్రమణ్యం(37)ను అరెస్టు చేసి అతని వద్ద నుంచి 7 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. అతను ఇచ్చిన సమాచారం మేరకు సింగిరికోన అటవీ ప్రాంతంలో దాడులు చేయగా రాళ్లకాల్వ వద్ద వీకేపాళేనికి చెందిన పెంచల ఈశ్వరయ్య(42)ను అరెస్టు చేశారు. సారా తయారీకి సిద్ధం చేసిన 100 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశారు. అరెస్టయిన నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. దాడుల్లో ఎస్‌ఈబీ ఎస్‌ఐ ఎ.నాగరాజు, సిబ్బంది రవి, శ్రీనివాసులు, సుధాకర్, హేమవతి, డీటీఎఫ్ సిబ్బంది ధర్మయ్య, అయ్యప్ప పాల్గొన్నారు.

స్పందన అర్జీలకు ప్రాధాన్యం ఇవ్వాలి



స్పందనలో వినతులను స్వీకరిస్తున్న అధికారులు

పాలసముద్రం: సచివాలయంలో నిర్వహించే స్పందన కార్యక్రమంలో ప్రజలు అందజేసే అర్జీలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సర్పంచ్ గాలి మహేష్ బాబు అన్నారు. సోమవారం ఎస్‌కేఆర్ పురం సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్, వీఆర్వో తంగరాజ్ ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ జీ మహేష్ బాబు మాట్లాడుతూ సచివాలయంలో నిర్వహించే స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి, సమస్యలను క్షేత్రస్థాయిల్లో పరిశీలించి, పరిష్కరిస్తేనే ప్రభుత్వ ఆశయం నెరవేరుతుందన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



ఆనందరావును సన్మానిస్తున్న అధ్యాపక బృందం

పుత్తూరు రూరల్: ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలల్లో పనిచేసే ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సాంకేతిక పరిపాలన ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.ఆనందరావు తెలిపారు. ఇటీవల సంఘం ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన నేపథ్యంలో సోమవారం స్థానిక పాలిటెక్నికల్ కళాశాల అధ్యాపక బృందం ఆనందరావును సన్మానించింది. ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల ప్రయోజనాలపై సంఘం నిరంత కృషి చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ఏఓ హనుమంతరావు, ఆ సంఘం పుత్తూరు మండల శాఖ అధ్యక్షుడు గుణవర్ధన్, కార్యదర్శి గురుప్రసన్న, అధ్యాపకులు రెడ్డిఈశ్వరి, వికాస్, నాగరాజు, ప్రసాదరావు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


పట్టాలు మంజూరు చేయించండి




వినతిపత్రం ఇస్తున్న గిరిజన సంఘం నేతలు

వడమాలపేట: మండలంలోని కొత్త చెంచువారి ఎస్టీ కాలనీ వాసులకు ఇంటి పట్టాలు మంజూరు చేయించాలని దళిత గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నందయ్య కోరారు. సోమవారం తహసీల్దార్ సుబ్రమణ్యంకు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా గుట్ట పోరంబోకు స్థలంలో గిరిజన కుటుంబాలు నివాసం ఉంటున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయకార్మిక సంఘం నాయకులు జయరామయ్య, సభ్యులు శ్రీనివాసులు, సుబ్రమణ్యం, వెంకటేష్, ప్రతాప్, యువరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏపీయూఎస్ మండల అధ్యక్షుడిగా అశోక్



అశోక్



రమేష్

వెదురుకుప్పం: ఏపీయూఎస్ మండల శాఖ అధ్యక్షుడిగా మండలంలోని పచ్చికాపల్లం జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడు ఎస్.అశోక్ ఎన్నికైనట్లు ఆశాఖ జిల్లా గౌరవాధ్యక్షుడు సుబ్రమణ్యం తెలిపారు. సోమవారం మండలంలోని పచ్చికావల్లంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన మండల కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా రమేష్, గౌరవాధ్యక్షురాలిగా సుజాత, మహిళా కార్యదర్శులుగా సునీత, పద్మ, సాంస్కృతిక కార్యదర్శిగా విజయలక్ష్మి, క్రీడా కన్వీనర్‌గా గోవిందరెడ్డి ఎన్నికైనట్లు చెప్పారు.

మండల సమావేశం రద్దు

నగరి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరగాల్సిన మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఎన్నికల కోడ్ కారణంగా రద్దయినట్లు ఎంపీపీ భార్గవి, ఎంపీడీఓ చంద్రమౌళి తెలిపారు. కోడ్ ముగిసిన అనంతరం సమావేశం నిర్వహిస్తామన్నారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయండి



నింద్రలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఏఈ

నింద్ర: మండలంలోని నింద్ర, ఎలకాటూరు గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న ఇళ్ల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ ఏఈ శ్రీధర్ రాజు సూచించారు. సోమవారం ఆయన నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేసి, గృహప్రవేశాలు చేయాలని కోరారు. ఆయనతో పాటు సర్పంచ్ బాబురెడ్డి, చంద్రబాబు తదితరులు ఉన్నారు.

ఉగాది లోపు నిర్మాణాలు పూర్తి చేయండి

గంగాధరనెల్లూరు: జగనన్న కాలనీల్లో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను ఉగాది లోపు పూర్తి చేయాలని ఎంపీడీఓ శ్రీదేవి కోరారు. మండలంలోని గంగాధర నెల్లూరు, నాశంపల్లె, ఎల్లమరాజుపల్లెలోని జగనన్న కాలనీల్లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనుల్ని సోమవారం ఆమె పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ జాప్యం లేకుండా పనులు వేగవంతం చేయాలన్నారు. సచివాలయ, హౌసింగ్ సిబ్బంది నిర్మాణ పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పూర్తయిన వెంటనే బిల్లులు మంజూరు చేయాలన్నారు. ఈఓపీఆర్డీ శివయ్య పాల్గొన్నారు.

నెరవేరిన దశాబ్దాల కల

శ్రీరంగరాజపురం: ఆరు దశాబ్దాల కల నేటికి డిప్యూటీ సీఎం నారాయణస్వామి చొరవతో మోక్షం లభించింది. వెంకటాపురం దళితవాడకు సరైన రహదారి సౌకర్యం లేదు. గతంలో రాజకీయ నాయకులు, అధికారుల చుట్టు తిరిగినా ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. ఆ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించిన సందర్భంగా గ్రామస్తులు రోడ్డు సమస్యను డిప్యూటీ సీఎం నారాయణస్వామి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించి ఆయన రోడ్డు నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు చేయించారు. దీంతో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. దీంతో గ్రామస్తులు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, ఉపముఖ్యమంత్రి నారాయణస్వామికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రత్యామ్నాయ భూములు ఇవ్వండి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పుత్తూరు రూరల్: మండలంలోని వేణుగోపాల్ సాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయిన వారికి ప్రభుత్వం వెంటనే ప్రత్యామ్నాయ భూములను కేటాయించాలని ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వి.బాబు డిమాండ్ చేశారు. సోమవారం రెవెన్యూ కార్యాలయం వద్ద గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయిన వారిలో కొందరికి మాత్రమే ప్రభుత్వం పరిహారం చెల్లించిందని, మిగిలిన వారందరికీ పరిహారంతో పాటు ప్రత్యామ్నాయ భూములు ఇవ్వాలని కోరారు. ఈ మేరకు తహసీల్దార్ రోశయ్యకు వినతిపత్రం అందజేశారు. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ వేణుగోపాల్‌సాగర్ ప్రాజెక్టుకు సంబంధించి కోర్టు కేసులు నడుస్తున్నాయని చెప్పారు. ప్రస్తుతం ప్రజల విజ్ఞప్తులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానని తెలిపారు. గ్రామీణ పేదల సంఘం కార్యదర్శి జి.భాస్కర్ పాల్గొన్నారు.

సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలి

శ్రీరంగరాజపురం: స్పందన అర్జీలను పరిశీలించి, అందుకు సంబంధించి సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని మండల తహసీల్దార్ షబ్బీర్‌బాషా అధికారులను ఆదేశించారు. మండలంలోని తన కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు, రైతుల నుంచి వినతులను స్వీకరించారు. స్పందనకు మొత్తం 14 ఫిర్యాదులు రాగా అందులో 9 భూ తగాదాలు, 2 శ్మశానానికి భూమి కేటాయించాలని, రెండు కమ్యూనిటీ, భవనాలకు స్థలం కేటాయింపు, మోటేషన్ 1 తదితర అర్జీలు అందాయి. వీటిని సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని వీఆర్వో, సర్వేయర్లను ఆదేశించారు. మండల సర్వేయర్ మురళి, ఎంపీడీఓ కృష్ణయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వానికి మంచిపేరు తేవాలి

పాలసముద్రం: వలంటీర్లు బాధ్యతగా పని చేసి ప్రభుత్వాన్ని మంచిపేరు తేవాలని ఆముదాల సర్పంచ్ అనురేఖ తెలిపారు. సోమవారం ఆముదాల సచివాలయంలో వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులతో కార్యదర్శి యశ్వత్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సర్పంచ్ అనురేఖ మాట్లాడుతూ వలంటీర్లకు కేటాయించిన కుటుంబాల్లోని అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమపథకాలను అందజేయాల్సిన బాధ్యత వలంటీర్లదేనని చెప్పారు. అర్హులైన లబ్ధిదారులు ఎవరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందకుండా ఇబ్బంది పడకూడదన్నారు. సచివాలయాలకు సమస్యల పరిష్కారానికి వచ్చే ప్రజలతో ఉద్యోగులు మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. వలంటీర్లు ప్రజలకు, ప్రభుత్వానికి వారధిలా వ్యవహరించాలని తెలిపారు. డీఏ చిన్నమరాజు, ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాలకు ఉచిత న్యాయ సహాయం



మాట్లాడుతున్న న్యాయవాది మురగేశరెడ్డి

పుత్తూరు రూరల్: బడుగు, బలహీన వర్గాలవారందరికీ న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందిస్తున్నట్లు సీనియర్ న్యాయవాది మురగేశరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధనిక, పేద అనే తారతమ్యం లేకుండా చట్టం ముందు అందరికీ సమన్యాయం జరగాలని ఐక్యరాజ్య సమితి పిలుపు ఇచ్చిన రోజున ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం జరుపుకుంటున్నట్లు తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలకు గురైన వారికి, ఆర్థికంగా వెనకబడిన వారికి, షెడ్యూల్ కులాల వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం ఉమాశంకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెసర పంట ప్రదర్శన క్షేత్రాల పరిశీలన



పెసర పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

నింద్ర: మండలంలోని అత్తూరు, అగరంపేట గ్రామాల్లో రైతులు తిరుపతి కృషి విజ్ఞాన కేంద్రం, జాతీయ అహర భద్రతా సంస్థ వారి సహకారంతో సాగు చేసిన పెసర పంట ప్రదర్శన క్షేత్రాలను సోమవారం శాస్త్రవేత్తలు పరిశీలించారు. శాస్త్రవేత్త శ్రీనివాసులు మాట్లాడుతూ పంటలో ఆకుముడత తెగులు నివారణ చర్యలు చేపట్టడంతో అధిక దిగుబడి వచ్చిందన్నారు. పంట కోత దశలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు.

25న 'కార్వేటినగరం కథలు' ఆవిష్కరణ

కార్వేటినగరం: కార్వేటినగరంపై ఆర్‌సీ కృష్ణస్వామిరాజు రచించిన కార్వేటినగరం కథలు పుస్తకాన్ని ఈ నెల 25వ తేదీన ఆవిష్కరించనున్నట్లు నిర్వాహకులు, డైట్ వైస్ ప్రిన్సిపల్ చెంగల్రాజు అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చారిత్రక కట్టడాలకు నిలయం కార్వేటినగరం అన్నారు. అలాంటి కళా ఖండాలపై స్థానికులు కృష్ణస్వామిరాజు రచించిన అద్భుతమైన కథల పుస్తకాన్ని జిల్లా విద్యాశిక్షణ సంస్థ(డైట్) ప్రిన్సిపల్, ఆర్కేఎస్సార్ పూర్వ విద్యార్థి శ్రీరాం పురుషోత్తం అధ్యక్షతన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అచార్య మధురాంతకం నరేంద్ర చేతుల మీదుగా డైట్ కళాశాల ఆడిటోరియంలో ఆవిష్కరించనున్నట్లు తెలిపారు.

జాతీయస్థాయి క్రీడలకు డీఎం పురం విద్యార్థి



బాలాజీని అభినందిస్తున్న హెచ్‌ఎం, టీచర్లు

కార్వేటినగరం: జాతీయస్థాయి వాలీబాల్ క్రీడలకు డీఎం పురం ఉన్నత పాఠశాల విద్యార్థి ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం నమశ్శివాయ తెలిపారు. సోమవారం జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థి బాలాజీ, పీఈటీ తిరుమలరాజుకు అభినందన సభ ఏర్పాటు చేశారు. హెచ్‌ఎం మాట్లాడుతూ పల్నాడు జిల్లా నరసారావు పేటలో జరిగిన రాష్ట్రస్థాయి వాలీబాల్ అండర్–14 విభాగం పోటీల్లో పి.బాలాజీ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. ప్రతి విద్యార్థి విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

నగరి: ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ గ్రీన్ అంబాసిడర్‌లు ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య మాట్లాడుతూ గ్రామాల శుభ్రతలో ప్రత్యేక పాత్ర పోషించే గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు బకాయి ఉందని, వాటిని చెల్లించాలన్నారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. స్వచ్ఛభారత్ ద్వారానే జీతాలు చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. గ్రీన్ అంబాసిడర్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేంద్రన్, జిల్లా సహాయ కార్యదర్శి యేసుపాదం, సభ్యులు చెంచురామయ్య, రవి పాల్గొన్నారు.